క్లుప్తంగా

కసుమూరు దర్గాలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్



వెంకటాచలం: మండలంలోని కసుమూరు దర్గాను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు దర్గా ముజావర్లు స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా షేక్ ఖాజా మాట్లాడుతూ మస్తాన్‌వలి వారి ఆశీస్సులతో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా నియమితులయ్యానని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ మీరా మొహిద్దీన్, ఉపసర్పంచ్ బాబర్, దర్గా ముజావర్లు దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

గణేశ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ సంగమేశ్వరావు

మనుబోలు: వినాయక చవితి సందర్భంగా గణేశ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరని పొదలకూరు సీఐ సంగమేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మనుబోలు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గణేశ విగ్రహాల ఏర్పాటుకు కనీసం ఐదుగురు కమిటీగా ఏర్పడి గుర్తింపు కార్డులతో పోలీస్ స్టేషన్‌లో అనుమతి పొందాలని సూచించారు. గణేశ ఉత్సవాలకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. మండపాల వద్ద అధిక శబ్దాలు చేసే మైక్‌లు వినియోగించరాదని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్లు నిలిపివేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు.

ఐటీఐకు ఉపకరణాల బహూకరణ



పొదలకూరు : పొదలకూరు ఐటీఐ కళాశాలకు 2020–23 బ్యాచ్‌కు చెందిన సివిల్ ఇంజినీరింగ్ పూర్వవిద్యార్థులు కలర్‌ప్రింటర్, ల్యామినేషన్ మెషీన్‌ను శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదివిన కళాశాలకు ఎంతో కొంత సేవ చేయాలని ఉపకరణలను అందజేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.

ఉచిత దంత వైద్యశిబిరం



మనుబోలు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. నెల్లూరుకు చెందిన డాక్టర్ కిరణ్ స్మైల్ డెంటల్ ఆస్పత్రి డాక్టర్ భవాని 26 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది ఆర్‌ఎంపీ నిఖిల్ తేజ, ప్రవల్లిక, భాను, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముంగర రవీంద్రరెడ్డి, బీజేపీ నాయకుడు ఓడూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

- మహిళకు తీవ్రగాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జంపాని కుమార్

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధమైన ఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఎస్సై జంపాని కుమార్ వివరాల మేరకు..కోడూరు పంచాయతీ పరిధిలోని కొత్తకోడూరు రోడ్డు పక్కన సులేమయ్య, నరసమ్మ దంపతులు పూరిల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి నరసమ్మ కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఇంటికి అంటుకున్నాయి. నరసమ్మ చీరకు సైతం మంటలు అంటుకోవడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు మంటలను అదుపు చేసి నరసమ్మను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సులేమయ్య ఇంట్లో లేకపోవడంతో అగ్ని ప్రమాదం నుంచి బయట పడ్డాడు. కాగా ఎస్సై జంపాని కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బుచ్చిరెడ్డిపాళెం: పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఏసీడీపీఓ అరుణ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిపాలలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని, బిడ్డకు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఆరోగ్య సిబ్బంది షాలిని, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తోటపల్లిగూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని మాచర్లవారిపాళెంలోని గణపతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మహా కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాట్లాడారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత అందరి తల్లిదండ్రులపై ఉందన్నారు. తగిన పౌష్టికాహారం అందినప్పుడే చిన్నారులు ఆరోగ్యకరంగా, పుష్టిగా ఎదగగలరన్నారు. ఏఎన్‌ఎం రమాదేవి,అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే రక్తహీనతను అధిగమించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీ పద్మావతి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం అంగన్‌వాడీ కేంద్రం–2లో నిర్వహించిన పోషణ మహా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారంతో పాటు చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: మాట్లాడుతున్న ఏపీడీపీఓ అరుణ



టీపీగూడూరు: గణపతి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో..



కొడవలూరు: యల్లాయపాళెంలో..

లేగ దూడలను సంరక్షించుకోవాలి



పాడి రైతులకు బహుమతులు అందజేస్తున్న విజయకుమార్

పొదలకూరు : పాడి రైతులు లేగదూడలను సంరక్షించుకోవాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ సూచించారు. మండలంలోని మరుపూరులోని పశువుల ఆస్పత్రి వద్ద శుక్రవారం నిర్వహించిన లేగ దూడల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగదూడల పెంపకం ద్వారా రైతులు ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. లేగ దూడల పోషణలో జాగ్రత్తలు, చూడి పశువుల పోషణపై అవగాహన కల్పించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి అధికారి వీ కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా అమలు చేస్తున్న జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం రైతులు మేలుజాతి పశువులను పొందేందుకు దోహదపడుతుందన్నారు. రైతులు పశువుల అత్యవసర వైద్యసేవల కోసం 1962 నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశుగణాభివృద్ధి సంస్థ డీడీ సోమయ్య మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణలో భాగంగా గేదెలు, ఆవులకు పెయ్యిదూడలు మాత్రమే పుట్టేందుకు అవకాశం ఉన్న సెమన్ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం 62 దూడలకు నట్టల నివారణ మందును ఉచితంగా అందజేశారు. ఆరోగ్యకరమైన లేగ దూడలకు బహుమతులు అందజేశారు. పాడి రైతులు కైలాసం కృష్ణారెడ్డి, మోపూరు వెంకటేశ్వర రెడ్డి, నేలటూరు విక్రమ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నేలటూరు నాగయ్య, తోడేరు పశువైద్యాధికారి శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

రబీలో అనువైన వరి వంగడాలను వేసుకోవాలి



కొడవలూరు: రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త ఎస్ లోకేష్‌బాబు



విడవలూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి


కొడవలూరు: రబీలో అనువైన వరి వంగడాలను వేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజా కుమారి రైతులకు సూచించారు. ఆత్మ సౌజన్యంతో కొడవలూరులో మండల స్థాయి రైతు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీలో ఎన్‌ఎల్‌ఆర్ 34449, 3354, 40024, 3238, 40054, బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. విత్తనాలను కొనుగోలు చేసిన వెంటనే మొలక శాతాన్ని విధిగా నిర్ధారించుకోవాలన్నారు. విత్తనం విత్తే ముందుగా శుద్ధి చేసుకోవాలని సూచించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త ఎస్ లోకేష్‌బాబు మాట్లాడుతూ వేరుశనగ పంటలో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను వివరించారు. వేరు శనగలో అధిక దిగుబడులకు టీసీజీఎస్ 1694 రకాన్ని సాగు చేసుకోవాలని సూచించారు. ఈ విత్తనం తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి గీతా కుమారి మాట్లాడుతూ భూసార పరీక్షలు విధిగా చేయించుకుని వాటి ఆధారంగా ఎరువుల మోతాదు నిర్ణయించుకుని ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

కోవూరు: రబీ సాగుచేసే రైతులు వరి విత్తనాలను తప్పనిసరిగా శుద్ధి చేసుకోవాలని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. విడవలూరులోని రైతుభరోసా కేంద్రంలో రైతులకు రబీ సాగుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో అనువైన వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. విత్తనాలను కొనుగోలు చేసిన తరువాత శుద్ధి చేసుకోవడంతో పాటు మొలక శాతాన్ని పరీక్షించుకోవాలని తెలిపారు. శాస్త్రవేత్త మారుతీదేవి మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పీ మధురిమ, ఏఓ వెంకటకృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీరోడ్డు నిర్మాణం

పొదలకూరు : పట్టణంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన సిమెంట్ రోడ్డు బాగా దెబ్బతినడంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. పొదలకూరు, ఇనుకుర్తి–డేగపూడి మధ్య రోడ్ల నిర్మాణాన్ని ఒక ప్యాకేజీగా విభజించి రూ.5.75 కోట్లు మంజూరు చేసినట్లు ఆర్‌అండ్‌బీ డీఈ సురేఖ తెలిపారు. ఈ నిధులతో పొదలకూరులో 650 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.



సిమెంట్ రోడ్డు పనులు చేపడుతున్న కూలీలు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పొదలకూరు విద్యార్థినులు

పొదలకూరు : స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ పార్వతి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు బీ పెంచల లోహిత, యూ ప్రహర్షిణి, పీ సమంత, ఐశ్వర్య రాణించారని చెప్పారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.



నేడు మంత్రి కాకాణి పర్యటన

తోటపల్లిగూడూరు: మండలంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ హేమలత శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఇస్కపాళెం పంచాయతీలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. మండలాధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేడు సీపేజీతో ఎండిన నిమ్మతోటల పరిశీలన

పొదలకూరు : కండలేరు సీపేజీ నీటితో ఎండిన నిమ్మతోటలను హార్టికల్చర్ వర్సిటీ శాస్త్రవేత్తలు శనివారం ఉదయం 10.30 గంటలకు పరిశీలిస్తారని పొదలకూరు ఉద్యాన శాఖాధికారి ఆనంద్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలు తోటలను సందర్శిస్తున్నారని చెప్పారు.

మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యం

పొదలకూరు : ఎంత మంది రాజకీయ పొత్తులు పెట్టుకున్నా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని మరుపూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ పదేళ్లుగా జనసేన పార్టీని స్థాపించి టీడీపీకి మేలు చేస్తున్నాడని విమర్శించారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో బాబును కలిసి బయటకు వచ్చిన పవన్ చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మించినట్లుగా మిడిమిడి జ్ఞానంతో మాట్లాడారన్నారు. సైబరాబాద్‌కు బీజం వేసింది దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి అని వివరించారు. ఇవేవి తెలియని పవన్ టీడీపీ ప్యాకేజీలకు అలవాటు పడి నోటికి ఏది పడితే అది మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేగా గెలవలేని ఆయన రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దమ్ముధైర్యం ఉంటే ఎమ్మెల్యేగా గెలవాలని సవాల్ విసిరారు.

రైల్లో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మనుబోలు: రైల్లో నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొమ్మలపూడి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు..కొమ్మలపూడి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఎస్సై హరిచందన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్లలోపు ఉండవచ్చునని, విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న రైల్లో నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు నలుపురంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, గ్రే కలర్ జీన్స్ ధరించి ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా లక్ష కుంకుమార్చన

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో లక్ష కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. మూలవర్లు, అనివెట్టి మండపంలో విశేషాలంకారంలో కొలువైన అమ్మవారికి విశేష పూజలను ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామశర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, సభ్యులు దొరబాబు, రామ్మోహన్‌రెడ్డి, సతీష్, పెంచలమ్మ, భారతి, నాగమణి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు ఎనలేనివి

ముత్తుకూరు: ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు ఎనలేనివని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని పొట్టెంపాడు వద్ద నక్కల కాలువ మేజర్ డ్రెయిన్ అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంజినీర్స్‌డే సందర్భంగా విశ్వేశ్వరయ్యను స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఎన్నో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లను నిర్మించి నేటి తరం ఇంజినీర్లకు ఆదర్శప్రాయుడిగా నిలిచారని కొనియాడారు.



మోక్షగుండం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి

డ్రంక్ అండ్ డ్రైవ్‌కు రూ.10 వేల జరిమానా



బుచ్చిరెడ్డిపాళెం స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: మద్యం తాగి వాహనాన్ని నడిపితే భారీ మూల్యం చెల్లించక తప్పదని, ఇప్పటి వరకు రూ.2 వేలుగా ఉన్న జరిమానాను రూ.10 వేల వరకు పెంచుతున్నట్లు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. తొలుత పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌తో ఎంతో మంది ప్రాణాలను పోగొట్టుకుంటుండడంతో దానిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేలు జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో వాహనాన్ని వదులుకోవాల్సిందేనన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారని, ఇలా చేయొద్దని ఆటోవాలాలతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమించి రెండోసారి కూడా ఆటోల్లో ఎక్కువ మందిని తీసుకెళ్తుంటే సీజ్ చేస్తామన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. అనుమానాస్పద మరణాలు, ఆత్మహత్యల కేసులను లోతుగా విచారించాలని సిబ్బందిని ఆదేశించారు. ముంబై జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, బ్లాక్ స్పాట్ల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐ రామారావు, బుచ్చిరెడ్డిపాళెం ఎస్సై వీరప్రతాప్, విడవలూరు ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రూ.4 లక్షలు ఆస్తి నష్టం

కోవూరు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగి గృహోపకరణాలు దగ్ధమైన ఘటన చినపడుగుపాడులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. చినపడుగుపాడులో విశ్రాంత ఉపాధ్యాయుడు మేడికొండ కోటయ్య నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఆయన ఇంటి మొదటి అంతస్తులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏసీ వద్ద మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులందరూ గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండి గమనించకపోవడంతో గృహోపకరణాలకు మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి కోటయ్యకు సమాచారం అందజేశారు. ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వెంటనే వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే గృహోపకరణాలతో పాటు బంగారు ఆభరణాలు, కొంత నగదు కాలిపోయిందని బాధితులు వాపోయారు.



జగనన్న ఆరోగ్య సురక్ష వరం



కొడవలూరు: ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



మహిళకు ఆరోగ్య సురక్ష కరపత్రాన్ని అందజేస్తున్న ఎంపీడీఓ

మనుబోలు: జగనన్న ఆరోగ్య సురక్ష రోగుల పాలిట వరమని ఎంపీడీఓ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని వెంకన్నపాళెం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శుక్రవారం ప్రారంభించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు. వెంకన్నపాళెం, పిడూరుపాళెం గ్రామాల్లో పదిహేను రోజుల పాటు సర్వే నిర్వహించి ఆరోగ్యశ్రీ యాప్‌లో నమోదు చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ నెల 30న వైద్యశిబిరం నిర్వహించి రోగులకు వైద్యసేవలందిస్తామని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు శీనయ్య, నరేష్, ఏఎన్‌ఎం ఇంద్రసేన,ఆశాకార్యకర్త సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సర్వే

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న ఆరోగ్య సురక్షపై మండలంలోని పంచేడులో వలంటీర్ ఇంటింటి సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్యామ్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంటింటిని సందర్శించి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి యాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. సర్వే తరువాత రోగులకు వైద్యులు వైద్యసేవలు అందిస్తారని వివరించారు.

కొడవలూరు: మండలంలోని దామేగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ప్రభుత్వ సూచనల మేరకు వలంటీర్లు సర్వే చేపడుతున్నారా..లేదాని పరిశీలించారు. ఆరోగ్యశ్రీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ వెంట కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జీ బాలచంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు చిమటా శేషగిరి, పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ ఉన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: పంచేడులో సర్వే చేస్తున్న వలంటీర్



ఇందుకూరుపేటలో..

ఆరోగ్య సేవలపై నోడల్ టీం సర్వే

ఇందుకూరుపేట: నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిడిముసలిలో నోడల్ అధికారులు ఆరోగ్య సేవలపై సర్వే చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు, ప్రయోజనాలు, వ్యాధుల నివారణ చర్యలపై ప్రజలను ఆరాతీశారు. ప్రధానంగా ఆరోగ్యశ్రీ, అమలు తీరును పరిశీలించారు. తొలుత హెల్త్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య సేవలను మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా సర్వే చేపడుతున్నట్లు నోడల్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. నోడల్ టీం బృందం డెమో కనక రత్నం,డిప్యూటీ డెమో కే సహనా, మైపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయ్‌కుమార్, శ్రావణి పాల్గొన్నారు.

గొలుసు అపహరణపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని సుబ్బారెడ్డినగర్‌లో చోటు చేసుకున్న గొలుసు అపహరణ ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై వీర ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. సుబ్బారెడ్డినగర్‌లో లోకిరెడ్డి వనమ్మ ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తోంది. గురువారం సాయంత్రం షాపు వద్దకు స్కూటీపై క్యాప్ పెట్టుకుని ఉన్న గుర్తుతెలియని వ్యక్తి వచ్చాడు. తనకు సిగరెట్ కావాలని అడిగాడు. వనమ్మ సిగరెట్ ఇస్తున్న సమయంలో దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించే ప్రయత్నం చేశాడు. వనమ్మ ప్రతిఘటించడంతో రోడ్డు మీదకు లాక్కొచ్చి బంగారు గొలుసును బలవంతంగా తెంపుకుని స్కూటీపై పరారయ్యాడు. ఈ ఘటనలో వనమ్మ మెడపై స్వల్ప గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు.